www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 11 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-146 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# కోమటిరెడ్డి కొత్త డ్రామాలు !

## కూసుకుంట్లకు టికెట్ రాకుంటే గెలుపు సులువని భావిస్తున్న రాజగోపాల్



- బీసీ వాదం పేరుతో కూసుకుంట్లను తప్పించేందుకు రాజగోపాల్‌రెడ్డి విశ్వప్రయత్నాలు
- కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా అసత్యపు ప్రచారం చేసే కుట్రలు



- పేడ్ వార్తలతో కూసుకుంట్లపై తప్పడు ప్రచారం చేయిస్తూ శునకానందం పొందుతున్న రాజగోపాల్‌రెడ్డి
- మతోన్మాద బీజేపీకి తావు లేదంటూ మునుగోడు నియోజక వర్గ ప్రజల తిరుగుబాటు
- అమ్ముడు పోయావంటూ రాజగోపాల్‌రెడ్డిని నిలదీస్తున్న ప్రజానికం
- పల్లెల్లో అడ్డుకుంటున్న ప్రజలు, సమాధానం చెప్పలేక వెనుదిరుగుతున్న రాజగోపాల్‌రెడ్డి
- పల్లె పల్లెన ప్రజాధరణ పొందుతున్న టీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టెందుకు ప్రజల ఆసక్తి
- మునుగోడు నియోజకవర్గ ప్రజలలో కూసుకుంట్లకు పెరుగుతున్న జనాదరణ
- రోజు రోజుకు పెరుగుతున్న చేరికలు, బలపడుతున్న టీఆర్ఎస్ పార్టీ

"మునుగోడు నియోజకవర్గ గ్రామాల్లో టీఆర్ఎస్ సంక్షేమ పథకాల ఎఫెక్ట్‌తో ప్రచారానికి వెళ్ళిన రాజగోపాల్‌రెడ్డిని ప్రజలు అడ్డుకుంటున్నారు. ఇన్నాళ్లు ప్రజలకు దూరంగా ఉండి, మునుగోడు ప్రజల కోసం రాజీనామా చేశాను అని ప్రగల్భాలు పలుకుతున్నావని నిలదీస్తున్నారు.

మునుగోడు ఉపఎన్నిక టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా కూసుకుంట్లకు టికెట్ కెటాయిస్తే గెలుపు అంత సులువు కాదని భావించి ఎలాగైనా కూసుకుంట్లకు టికెట్ రాకుండా చేసేందుకు రాజగోపాల్‌రెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. బీసీలకు టికెట్ ఇవ్వాలనే డిమాండ్‌ను వినిపించేందుకు కొందరిని తాయిలాలతో తడిపి ఆందోళన చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**నల్లగొండ, సెప్టెంబర్ 10 (సమ సమాజం):** మునుగోడు ఉపఎన్నిక రాష్ట్ర రాజకీయాలలో పెను సంచలనంగా మారింది. రాజగోపాల్‌రెడ్డి రాజీనామా తరువాత మునుగోడు నియోజక వర్గంలో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బీజేపీ పార్టీలోకి రాజగోపాల్‌రెడ్డి చేరిన తరువాత వివిధ గ్రామాల్లో పర్యటనలు చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి శనివారం మర్రిగూడెం గ్రామానికి వెళ్లగా సమస్యలపై ఓ మహిళ ఆయనను నిలదీసింది. మీ కోసమే రాజీనామా చేశానని ఆయన చెప్పినప్పటికి ఆ మహిళ గ్రామంలోని సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపించింది. సదరు మహిళకు సమాధానం చెప్పలేక అక్కడి నుంచి రాజగోపాల్‌రెడ్డి నిష్క్రమించాడు. ఇదిలా ఉంటే... శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అదిష్టానం పాల్వాయి స్రవంతిని మునుగోడు ఉపఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన సంగతి విదితమే. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరనేది ఉత్కంఠ వీడిన తరువాత టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎవ్వరు అనే అంశం తెరపైకి వచ్చింది. దాదాపు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని బరిలో నిలుపాలని భావిస్తున్న టీఆర్ఎస్ అదిష్టానం, కొంత సంయమనం పాటిస్తుంది. ఇంతలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొత్త డ్రామాలకు సిద్ధమౌతున్నాడు. శనివారం కొన్ని ప్రసార మాధ్యమాల్లో పేడ్ వార్తలు ప్రసారమైనాయి. కావాలనే బీసీ నినాదం బలపడినట్లు, బీసీ అభ్యర్థిని టీఆర్ఎస్ పార్టీ ప్రకటిస్తుందని అసత్యపు ప్రచారాన్ని చేయించారు. ఇదంతా రాజగోపాల్‌రెడ్డి కనుసన్నల్లో జరిగిందని విశ్వసనీయ సమాచారం.







రాజగోపాల్‌రెడ్డిని మర్రిగూడెం గ్రామంలో అడ్డుకున్న గ్రామస్తులు

- కూసుకుంట్లకు టికెట్ కెటాయిస్తారని రాజగోపాల్‌రెడ్డిలో మొదలైన అలజడి

కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి బరిలో నిలిస్తే టీఆర్ఎస్ పార్టీ గెలుపు కాయం అనడంలో సందేహం లేదు. ఇదే జరిగితే ప్రధానంగా రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ మూడో స్థానానికి పడిపోయే ప్రమాదం లేకపోలేదు. అందుకే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి టీఆర్ఎస్ పార్టీ టికెట్ రాకుండా ఉండేందుకు కొత్త డ్రామాలు షురూ చేసిండు. ఈ డ్రామాలో కొంత మంది నాయకులతో తెరవెనుక రాజగోపాల్‌రెడ్డి ఉండి బీసీ నినాదం పేరుతో కూసుకుంట్లకు టికెట్ ఇస్తే పని చేయమని, బీసీకి టికెట్ కెటాయించాలని డిమాండ్ చేసే విధంగా రాజగోపాల్‌రెడ్డి కుయూక్తులు పన్నుతున్నారు. వాస్తవానికి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి క్షేత్ర స్థాయిలో ప్రజలలో గట్టి పట్టున్న నేత. అలాంటప్పుడు రాజగోపాల్‌రెడ్డి గెలవడం మాట పక్కకు పెడితే, బీజేపీలో తన ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో కూసుకుంట్లకు బై పోల్ టికెట్ రాకుండా చేయాలనే విశ్వప్రయత్నంలో రాజగోపాల్‌రెడ్డి ఉన్నారని తెలుస్తుంది. మునుగోడు నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీలో చేరికలు భారీగా జరుగుతున్నాయి. కూసుకుంట్ల జనాధరణ పెరుగుతున్నందున టీఆర్ఎస్ పార్టీ అదిష్టానం కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి టికెట్ కెటాయించుటకు సుముఖంగా ఉన్నట్లుగా తెలుస్తుంది.

# మునుగోడులో ఎగిరేది గులాబీ జెండానే

కమలం పార్టీకి ఇక్కడ స్థానం లేదు: మంత్రి



**నల్లగొండ, సెప్టెంబర్ 10 (సమసమాజం):** మునుగోడులో గుబాళించేది గులాబీ జెండాయేనని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. ఇప్పటికే అక్కడ టీఆర్ఎస్ విజయం ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని చెప్పారు. ఆ పార్టీ డ్రామాలను ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. బిజెపి వస్తే ఏం జరుగుతుందో సిలిండర్ చూస్తేనే తెలుస్తుందిన అన్నారు. మునుగోడు నియోజకవర్గ పరిధిలోని

2వ

# మునుగోడులో ఎగిరేది కమలం జెండానే

కూట్లో రాయితీయలేని వాడు..ఏట్లో రాయి తీస్తాడా

తెలంగాణను పాలించలేని కెసిఆర్ దేశాన్ని ఏలుతాడా

జీతాలు కూడా ఇవ్వలేక రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించాడు : ఈటెల రాజేందర్



**నల్లగగొండ, సెప్టెంబర్ 10 (సమసమాజం):** కేసీఆర్‌కు దేశ రాజకీయాలు నడిపించే చేసే సత్తా లేదని హుజూరా బాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణలోనే పాలన అస్తవ్యస్తంగా ఉందని, రాష్ట్రాన్ని ఆర్థికంగగా దివాళా తీయించారని అన్నారు. అలాంటి వ్యక్తి దేశాన్ని నడిపిస్తారని ఎవరైనా నమ్ముతారా అని మండిపడ్డారు. ప్రజలను బోల్తా కొట్టించడంలో

2వ

# బాసరలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

26నుంచి 5 వరకు దసరా ఉత్సవాలు

**బాసర,సెప్టెంబర్ 10 (సమసమాజం):** బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గత రెండేళ్లుగా కరోనాతో పెద్దగా ఉత్సవాలను నిర్వహించలేదు. ఈ క్రమంలో ఈ నెల 26 వ తేది నుంచి దసరా మహోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. 26నుంచి అక్టోబర్ 5వ తేది వరకు జరిగే ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులు ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. ఆలయ కార్యాలయంలో వివిధ విభాగాలలో పనిచేసే అదికారులు పాల్గొని భక్తులకు అవసరమైన వసతి సౌకర్యాలు గురించి చర్చించారు. అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాలు, వివిధ మండపాలకు ప్రతి ఏడాది మాదిరిగానే విద్యుత్‌దీపాలతో అలంకరించాలని అందుకు సంబంధించి పనుల కోసం టెండర్లు పిలవాలని నిర్ణయించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు,అక్షరాభ్యాసాలకు లోటు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఇవో తెలిపారు.

# తెలంగాణ చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి, టిఆర్ఎస్

- తెలంగాణ విలీనాన్ని విమోచనం ఎలా అంటారు
- నేటినుంచి సిపిఐ ఆధ్వర్యంలో సాయుధపోరాట వారోత్సవాలు
- సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడి



**హైదరాబాద్,సెప్టెంబర్ 10 (సమసమాజం):** తెలంగాణ సాయుధ పోరాటంతో భాజపాకు సంబంధం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడిన వాళ్లకు పింఛన్ ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఆదివారం నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. సాయుధ పోరాటం వల్లే తెలంగాణ ప్రాంతం భారతదేశం లో విలీనమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. భాజపా, ఆర్ఎస్ఎస్ విలీనం కాదని.. విమోచనం అంటున్నాయని అభ్యంతరం వ్యక్తం చేసిన ఆయన.. తెలంగాణ సాయుధ పోరాటంలో భాజపాకు సంబంధమే లేదని కొట్టి పారేశారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని విలీనంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమైక్యతా దినం అంటే అర్థం లేదని పేర్కొన్నారు. చరిత్రను చరిత్రగా తీసుకురాకపోతే సమాజానికి, దేశానికి ద్రోహం చేసిన వాళ్లవుతారని తెలిపారు. సమైక్యతా దినం అనడంలో అర్థం లేదు.. విలీనంగా ప్రకటించాల్సిందేనని అన్నారు. నేటి నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తామని.. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న మగ్దుమ్ మోహినుద్దీన్ విగ్రహం నుంచి వారోత్సవాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యానికి గవర్నర్ వ్యవస్థ అంత మంచిది కాదన్నారు. గవర్నర్ వ్యవస్థను తమిళి సై దుర్వినియోగం చేస్తున్నారని కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఈ నెల17న ఎగ్జిబిషన్ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. భాజపా, ఆర్ఎస్ఎస్ వాళ్లు విలీనం కాదు.. విమోచనం అంటున్నారు. విమోచనం అంటే ముస్లిం పాలకుల నుంచి హిందువులకు విమోచనం కల్గింది. దేశ భక్తులు ఎప్పుడు కూడా మతం, కులం ప్రాతిపదికన సమాజాన్ని విచ్ఛిన్నం చేయరు. అలా చేస్తే అది ఓట్ల కోసమే తప్ప దేశభక్తి కాదు. చరిత్రను చరిత్రగా తీసుకురాకపోతే సమాజానికి, దేశానికి ద్రోహం చేసిన వాళ్లవుతారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని విలీనంగా ప్రభుత్వం ప్రకటించాలని కూనంనేని డిమాండ్ చేశారు.

# అహంకారంతో అవాకులు చవాకులు పేలొద్దు

వైఎస షర్మిలకు ఘాటు మంత్రి నిరంజన్ హెచ్చరిక

**వనపర్తి, సెప్టెంబర్ 10 (సమసమాజం):** వైఎస్ షర్మిలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. అహంకారంతో వ్యక్తిగతంగా దూషిస్తే.. ఒక్కమాటకు వందమాటలు అంటాం.. ఆత్మవిశ్వాసంతో చీల్చి చెండాడుతామని తేల్చిచెప్పారు. రాజన్న బిడ్డవైతే రేపు మునుగోడులో పోటి చేసి నీ సత్తా ఏంటో చూపించాలని షర్మిలకు నిరంజన్ రెడ్డి సవాల్ విసిరారు. గోపాల్‌పేట మండల పరిధిలోని 16 గ్రామపంచాయతీలకు చెందిన 1331 మందికి నూతన ఆసరా ఫించను గుర్తింపు కార్డులను మంత్రి నిరంజన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యక్తిగత దూషణలతో యాత్రలు చేయడం దారుణమన్నారు. తెలంగాణ గురించి షర్మిలకు ఏం తెలుసని అన్నారు. 22 ఏండ్లుగా తెలంగాణ జెండా పట్టుకుని ప్రజల మధ్యన ప్రజల ఆకాంక్ష కోసం కొట్లాడిన ఉద్యమకారున్ని అని తెలిపారు. రక్తపు కూడు తిని పెరిగిన చరిత్ర మీది అని షర్మిలపై ధ్వజమెత్తారు. వైఎస్ ఆదాయపు పన్ను కట్టకముందే న్యాయవాదిగా ఆదాయపు పన్ను కట్టిన వ్యక్తిని అని గుర్తు చేశారు. తెలంగాణ గడ్డ మీద అహంకారంతో యాత్ర చేస్తూ తెలంగాణ వారిని దూషించడం సరికాదని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి నియోజకవర్గం పరిధిలో ఉన్న పొలికెపాడు గ్రామవాసి గువ్వల బాలరాజును అవహేళన చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గువ్వల బాలరాజు అచ్చంపేట ఎమ్మెల్యే ఆయన అక్కడ అభివృద్ధి చేస్తాడు.. నేను ఇక్కడ అభివృద్ధి చేస్తానని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. పొలికెపాడు గ్రామానికి సాగునీరు తెస్తే ఒకే ఒక్క యాసంగిలో రూ. 20 కోట్ల పంట పండించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉన్నప్పుడే నా బిడ్డలను విదేశాల్లో చదివించానని తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు తెచ్చి ఎకరా ఎకరాకు నీళ్లు పారించిన వ్యక్తిని అని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.మీ రెండు వందలు ఎక్కడ?

2వ

# రాహుల్‌తో పాస్టర్ నొన్నయ్య భేటీ

జీసస్‌పై ప్రశ్నలకు వివాదాస్పద సమాధానాలు

నాలుగోరోజు కొనసాగిన రాహుల్ యాత్ర

తిరువనంతపురంలో స్వాగతించేందుకు ఏర్పాట్లు

**తిరువనంతపురం, సెప్టెంబర్ 10 (సమసమాజం):** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల చేపట్టిన భారత్ జోడో యాత్ర శనివారానికి నాలుగో రోజుకు చేరుకుంది. అందులో భాగంగా ప్రస్తుతం ఆయన తమిళనాడు పాదయాత్రలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలోనే తమిళ క్రైస్తవ పాస్టర్ జార్జ్ పొన్నయ్య, రాహుల్ గాంధీని కలిశారు. ఈ భేటీలో రాహుల్ గాంధీ అడిగిన ఓ ప్రశ్నకు పొన్నయ్య ఇచ్చిన సమాధానం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. జీసస్ క్రీస్తు.. నిజమైన దేవుని రూపమని అంటారు కదా.. ఇది నిజమేనా అన్న రాహుల్ గాంధీ ప్రశ్నకు.... జీసస్ నిజమైన దేవుడని పొన్నయ్య



2వ

# దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది

క్షేత్రస్థాయికి శాస్త్ర,సాంకేతిక పరిశోధనలు

అహ్మదాబాద్ సైన్స్ కాన్‌క్లేవ్ ప్రారంభించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (సమసమాజం):** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. దేశం ఎదుగుదలను చూసి గర్వపడుతున్నానని ప్రధానమంత్రి



3వ

# ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలి

పాలకుర్తిలో ఘనంగా వర్దంతి వేడుకలు

**జనగామ, సెప్టెంబర్ 10 (సమసమాజం):** తెలంగాణ వీరనారి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎం ఎల్) రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పాలకుర్తి మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ఐలమ్మ కుటుంబ సభ్యులతో కలిసి 37 వ వర్థంతిని నిర్వహించారు. ఐలమ్మ స్మారక స్థూపం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ రాజా మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రజాకార్ల ఆగడాలను ఎదిరించిన వీరనారి ఐలమ్మ అని

2వ

## సంపాదకీయం

# దేశవ్యాప్తంగా ఉచిత విద్యుత్ సాధ్యమా ?

వ్యవసాయ బావుల వద్ద మీటర్లు పెట్టడం వల్ల మంచి ఫలితాలు సాధించామని, విద్యుత్ కూడా ఆదా అయ్యిందని ఏపి సిఎం జగన్ పదేపదే చెబుతున్నారు. విజయనగరం జిల్లాలో మంచి ఫలితాలు సాధించామని అన్నారు. ఉచిత విద్యుత్ కొనసాగిస్తూనే ఎంత ఖర్చవుతుందో తెలుసుకోవడానికి దీనిని చేపట్టామని అన్నారు. అయితే తెలంగాణ సిఎం కెసిఆర్ మాత్రం మోటర్లకాడ మీటర్లు పెట్టనే పెట్టమని అంటున్నారు. అలాగే కార్పోరేట్ సోలార్ పవర్ కొనుగోళ్లకు కేంద్రం ఒత్తిడి చేస్తోందని మండిపడుతు న్నారు. ఇకపోతే జాతీయపార్టీ పెడతానంటున్న కెసిఆర్ దేశవ్యాప్తంగా ఉచిత విద్యుత్ ఇస్తామని అంటున్నారు. నిజానికి ఉచితాలు ఎంతవరకు అవసరమో చర్చ లేకుండా ఏదైనా ఉచితం అన్న నినాదం ఇప్పుడు రాజకీయ పార్టీలు పలవరిస్తున్నాయి. కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో ఆకట్టుకోవడానికి ఇదే నినాదంగా మలచుకోబోతున్నారు. గతంలో ఉమ్మడి ఎపిలో వైఎస్ ఇచ్చిన ఉచిత విద్యుత్ నినాదం టిడిపిని దెబ్బతీసింది. అందుకే ఇటీవల వరుసగా రైతు సంఘాలతో మీటింగ్‌లు పెట్టి వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అందుకు ప్రాతిపదికగా ఉచిత విద్యుత్ నినాదం ఎత్తుకున్నారు. అధికశాతం ప్రజల జీవనాధారమైన వ్యవసాయరంగం పట్ల, రైతుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు ఇప్పటికే ఉండగా..తాజాగా వ్యవసాయ విద్యుత్‌కు మీటర్ల బిగింపు ఇప్పుడు చర్చనీయాంశంగా..ఆందోళనకరంగా మారింది. ఎపిలో దీనికి సంబంధించిన అలజడి రేగుతోంది. ఉచిత విద్యుత్ ఎత్తేసే కుట్ర అని ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే డిస్కంలకు కోట్ల రూపాయల బకాయలు పడ్డాయిన కేంద్రం ఆరోపిస్తోంది. విద్యుత్ నియంత్రణ బిల్లుకు నడుం బిగించిన కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోందన్న విమర్శలు ఉన్నాయి. విద్యుత్ నియంత్రణ అంతా ఇక కేంద్రం చేతిలోకి వెళితే రాష్ట్రాలపై విద్యుత్ భారం తడిసి మోపెడు కానుంది. అదనపు అప్పులు తెచ్చుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాస్ట్రాలపై ఒత్తిడి పెంచింది. ఉచిత విద్యుత్తు రైతుల హక్కుగా సాధించుకొన్నది. దానిని నగదు బదిలీ పేరిట ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడినదిగా మార్చి సంక్షేమ పథకాల సరసన చేర్చడంలో కేంద్రం ఒత్తిడి దాగి ఉంది. అసలే సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని నగదు బదిలీ పథకం ద్వారా మరింత సంక్షోభంలోకి నెడుతుంది. ఇప్పటి వరకు వ్యవసాయం కోసం అందజేస్తున్న ఉచిత విద్యుత్తుకు ప్రభుత్వం ఎలాంటి బిల్లులను వసూలు చెయ్యడం లేదు. ఇకపై మాత్రం రైతులు విద్యుత్ బిల్లులను చెల్లించాల్సిందే. ఆ బిల్లుల మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెబుతున్నప్పటికీ మున్ముందు ఈ పథకానికి ప్రభుత్వం నుంచి ముప్పు ఉండదని చెప్పే పరిస్థితి లేదు. వ్యవసాయ విద్యుత్తుకయ్యే ఖర్చం తా ఇకపై ప్రభుత్వమే భరిస్తుంద న్నప్పుడు ఈ విద్యుత్ మీటర్ల కసరత్తంతా ఎందుకన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలన్న జగన్ ప్రభుత్వ నిర్ణయం విమర్శలకి దారితీస్తున్నది. అయితే ఇదంతా కేంద్రం ఒత్తిడి మేరకే అన్నది అందరికీ తెలిసిందే. అయినా విపక్ష టిడిపి దీనిపై విమర్శలు గుప్పిస్తూనే ఉంది. తెలంగాణలో అయితే మీటర్లు బిగించేది లేదని సిఎం కెసిఆర్ ఖరాఖండిగా చెప్పారు. అలాగే విద్యుత్ నియంత్రణ బిల్లును వ్యతిరేకిస్తా మని సిఎం కెసిఆర్ గతంలోనే ప్రకటించారు. భూమ్యాకాశాలను ఏకం చేస్తామన్నారు. ఇక కొత్తగా ప్రతి పాదించిన నగదు బదిలీ ప్రకారం ఒక్కో రైతు వ్యవసాయానికి ఎంత వాడుతున్నది ఖచ్చితంగా లెక్కగట్టి ఆ సొమ్మును తన ఖాతాకు బదలాయించి నగదుగా జమచేయాలన్నది ఈ పథకం ఉద్దేశ్యం. స్మార్ట్‌గా ఉచిత విద్యుత్‌కు ఎసరు పెడతాయనే ఆందోళన రైతులు అందరిలో వుంది. రైతులపై ఒక్క రూపాయి కూడా భారం మోపబోమని ముప్పై ఏళ్ల ఉచితాన్ని కొనసాగించే సత్తా వుందని ముఖ్యమంత్రి జగన్ ఇతర మంత్రులు చెబుతున్నా అనుమానాలు మాత్రం అలాగే వున్నాయి. ఇప్పుడు ఈ మీటర్ల ప్రవేశ పెట్టడానికి కారణం కేంద్రంలోని మోడీ ప్రభుత్వ షరతు తప్ప రాష్ట్రం ఇచ్ఛికంగా చేస్తున్నది కాదన్న విమర్శలు ఉన్నాయి. మొత్తంగా సజావుగా సాగిపోతున్న ఉచిత వ్యవసాయ విద్యుత్‌లో అనేక ప్రశ్నలు ఉదయి స్తున్నాయి. కేంద్రం రాసిన లేఖలోని షరతుల ప్రభావమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా చెబుతున్నది. అలాంటప్పుడు రేపు ఆ షరతులు మరింత బిగుసుకుంటాయో మరెన్ని కొత్త ఆంక్షలు చేరతాయో ఎవరు చెప్పగలరు? ముఖ్యమంత్రి జగన్ మాత్రం రైతులపై రూపాయి భారం కూడా పడబోదని చెబుతున్నారు. రాజకీయంగా కొత్త విద్యుత్ విధానాన్ని వ్యతిరేకించిన తెలంగాణ కూడా స్మార్ట్ మీటర్లను తెప్పించక తప్పని పరిస్థితి ఏర్పడబోతోంది. కేంద్రం ఒత్తిడి క్షేత్రస్థాయిలో రైతు అలజడికి కారణమవుతున్నది. ఇదంతా ఉచిత విద్యుత్ నుంచి దశలవారీగా తప్పుకునేందుకే అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయాన్ని విపక్షాలు కూడా అంగీకరిస్తున్నాయి. నగదుబదిలీ పథకం పేరుతో ఉచిత విద్యుత్తుకు వెన్నుపోటు పొడుస్తోందని వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తోందని టిడిపి అంటోంది. కేంద్రం షరతులను వ్యతిరేకించాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వం ఇలా మెతక వైఖరి అవలంబిస్తూ రైతు ప్రయోజనాలను పణంగా పెట్టడం సమర్థనీయం కాదని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉచిత విద్యుత్ సాధ్యమా అన్నది ఆలోచించాలి. అలాగే ఆ మేరకు మన ఉత్పాదకత ఉందా అన్నది కూడా ముఖ్యమే. అనేక గ్రామాలకు, బాయిలకు ఇప్పటికీ విద్యుత్ సరఫరా లేదు. అలాంటప్పుడు పంపిణీతో పాటు, లభ్యత కూడా సవాల్ కానుంది. కెసిఆర్ ప్రకటన వినడానికి సులువుగానే ఉన్నా ఆచరణలో మాత్రం అంత సులువు కాదని గుర్తించాలి. ముందుగా దేశంలో నిరంతర విద్యుత్ కోసం కృషి జరగాలి. ఉన్న విద్యుత్‌ను ఇప్పుడు సరఫరా చేయడానికే సరిపోదు. విద్యుత ఉత్పాదకత పెంచకుండా ఉచిత విద్యుత్ సాధ్యం కాదని కూడా పాలకులు తెలుసుకోవాలి.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మునుగోడులో ఎగిరేది గులాబీ జెండానే

(మొదటి పేజీ తరువాయి..)మర్రిగూడ మండలం కొండూరు గ్రామ ఉప సర్పంచ్ పాలకుర్ల జంగయ్య గౌడ్, వార్డు సభ్యులు జహంగీర్, పగడాల రాములు, రాంబాబు, ఉడుగు శ్రీను శనివారం ఉదయం హైదరాబాద్‌లో మంత్రి జగదీశ్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశానికి సీఎం కేసీఆర్ నాయకత్వమే శరణ్యమన్నారు. కెసిఆర్‌తోనే దేశానికి దారిచూపగలుగుతారని అన్నారు. మోడీ కేవలం కార్పోరేట్ గద్దలకు దోచి పెట్టడానికే సరిపోతారని అన్నారు. కమలం పార్టీకి తెలంగాణలో స్పేస్ లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో లేదని గల్లీలో రాదని ఎద్దేవా చేశారు. అందుకే గులాబీ పార్టీలోకి వలసలు కోనసాగుతున్నాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంపై పెరిగిన విశ్వసనీయతకు ఇది అద్దంపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఒదంపేట మాజీ ఎంపీపీ గోవింద్, గ్రామ సర్పంచ్ కుంభం నర్సమ్మ మాధవ రెడ్డి, మాజీ సర్పంచ్ ఉడుగు అంజయ్య అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అహంకారంతో అవాకులు చవాకులు పేలొద్దు

(మొదటి పేజీ తరువాయి..) మా రెండు వేలు ఎక్కడ? అని ప్రతిపక్షాలను ఉద్దేశించి ప్రశ్నించారు. 10 లక్షల మందికి కొత్త పెన్షన్లు ఇచ్చిన ఘనత తమ సర్కార్‌ది అని తెలిపారు. ఊర్లో ఎవరైనా చస్తే తప్పు ఫించను రాని పాలన నుండి బతికున్న మనుషులకు ఫించన్లు ఇస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిది అని స్పష్టం చేశారు. పాలన రాదన్న స్థితి నుండి దేశ పాలనకు దిక్సూచిలా నిలిచామన్నారు.

# మునుగోడులో ఎగిరేది కమలం జెండానే

(మొదటి పేజీ తరువాయి..)కెసిఆర్ నంబర్ వన్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా మీట్‌లో మాట్లాడిన ఆయన.. చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. కూట్లో రాయి తీయలేనివాడు ఏట్లో రాయితీస్తాడా? అని ఈటల ఈ సందర్భంగా కొన్ని ఎద్దేవా చేశారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల విశ్వాసం కోల్పోయిన కేసీఆర్, దేశ ప్రజల నమ్మకాన్ని కూడగడతాడా? అని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు కేసీఆర్‌ను ఒక బఫూన్ లా చూస్తున్నారన్న ఈటల... ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని దివాళా తీయించిన కెసిఆర్ వల్ల ఏమీకాదన్నారు. గురుకుల పాఠశాలలో పురుగుల అన్నం తిని విద్యార్థులు చనిపోతున్న పరిస్థితి ఉందని ఈటల రాజేందర్ అన్నారు. కరప్షన్ కు మారుపేరు కేసీఆర్, కుటుంబ పాలనకు మారుపేరు కేసీఆర్ అని ఈటల దుయ్యబట్టారు. ఈ క్రమంలోనే కేసీఆర్‌కు దేశ రాజకీయాలు చేసే సత్తా లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో చెల్లని రూపాయిగా మారిన కేసీఆర్ దేశంలో ఏం చెల్లుతాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని సర్పంచ్‌లకు బిల్లులు రావాలంటే టీఆర్ఎస్ పార్టీలో చేరాలని టీఆర్ఎస్ నాయకులు బెదిరిస్తున్నారని ఆరోపణలు చేశారు. హుజూరాబాద్‌లో ప్రజలు ఏ తీర్పుపై ఇచ్చారో మునుగోడులోనూ అదే తీర్పు పునరావృతం అవుతుందని ఈటల జోస్యం చెప్పారు. ఉప ఎన్నిక వస్తేనే కేసీఆర్ ప్రగతి భవన్ నుంచి బయటకి వస్తాడన్నారు. యావత్ భారతదేశం మునుగోడు నియోజకవర్గ ఉప ఎన్నిక వైపే చూస్తోందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. మునుగోడు ఉప ఎన్నికతో ఏం జరుగుతుందోనని తెలుసుకోవడానికి దేశమంతా ఆసక్తితో ఎదురుచూస్తోందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంత పాలన అంతం మునుగోడు నుంచే మొదలవుతుందని చెప్పారు. తెలంగాణ రైతులకు రుణాలను మాఫీ చేయకుండా బిహార్, పంజాబ్ రాష్ట్రాల్లోని రైతులకు సీఎం కేసీఆర్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. మునుగోడు నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉందని, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసే పరిస్థితి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

### ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి..)కొనియాడారు. విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి అరాచకాలపై తిరుగుబాటు చేసి తెలంగాణ రైతాంగ పోరాటానికి నాంది పలికిన వీర వనిత ఐలమ్మ అని అన్నారు. ఐలమ్మ తెలంగాణకు ఐకాన్ గా నిలిచిందని, ఆమె నిత్యం ప్రజా పోరాటాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చెప్పారు. ఆమె అందించిన విప్లవ స్ఫూర్తితో ముందుకెళ్లాలని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం ఐలమ్మ జయంతి, వర్ధంతిలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ అనంతోజు రజిత, సీపీఐ(ఎంఎల్ ) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మాన్యపు భుజందర్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదార్, ఐలమ్మ మనుమరాలు రాపర్తి మంజుల మాట్లాడుతూ.. ఐలమ్మ తెలంగాణకు గర్వకారణమని, ఐలమ్మ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ కుటుంబ సభ్యులు చిట్యాల యాకయ్య(ఇంజనీర్ ), చిట్యాల సంధ్యారాణి, చిట్యాల యాకయ్య, చిట్యాల లింగమ్మ, సీపీఐ(ఎంఎల్ ) లిబరేషన్ జిల్లా సభ్యులు జీడి సోమయ్య, రజక సంఘం నాయకులు జ్యోతి యాదగిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మునుగోడు టిఆర్ఎస్ లో తొలగని ఉత్కంఠ

**అభ్యర్థి ఎవరన్నదానిపై ఎదురుచూపు**




**హైదరాబాద్,సెప్టెంబర్10 (సమసమాజం):** టీఆర్ఎస్‌లో మునుగోడు ముసలం కొనసాగుతోంది. మునుగోడు అభ్యర్థి ఎవరన్నదానిపై గులాబీ నేతల్లో ఉత్కంఠ చోటు చేసుకుంది. టికెట్ కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. మునుగోడు టీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న వారు పార్టీ అధినేత ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. పాల్వాయి స్రవంతిని అధికారికంగా కాంగ్రెస్ ప్రకటించింది. అలాగే బిజెపి నుంచి రాజీనామా చేసిన రాజగోపాల్ రెడ్డి పోటీ పడనున్నారు. దీంతో కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు ఎవరన్నది తేలిపోయింది. ఇక టిఆర్ఎస్ అబ్యర్తిని ప్రకటించాల్సిఉంది. అలకలు తీర్చే పనిలో ఉంది. బీజేపీ, కాంగ్రెస్ నుంచి బరిలో రెడ్డి సామాజికవర్గ నేతలు ఉన్నారు. అయితే టీఆర్ఎస్ టికెట్ను సైతం రెడ్డి సామాజిక వర్గానికే ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ దాదాపు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ లేదా మండలి చైర్మన్ గుత్తా మధ్య పోటీ నెలకొంది. కూసుకుంట్ల వైపే కేసీఆర్ మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. సర్వేల ఆధారంగా అభ్యర్థిని కేసీఆర్ ప్రకటించనున్నారు. అయితే వీలైనంత త్వరగా అభ్యర్థిని ప్రకటించాలని స్థానిక నేతలు కోరుతున్నారు.

# టిక్కెట్ దక్కని నేతలకు రేవంత్ బుజ్జగింపు

**పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచన**

**భవిష్యత్‌లో మంచి అవకాశం ఉంటుందని హామీ**



**హైదరాబాద్,సెప్టెంబర్ 10 (సమసమాజం):** మునుగోడు ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా పాల్వాయి స్రవంతిని ఏఐసీసీ ఖరారు చేసిన నేపథ్యంలో.. టికెట్ ఆశించి భంగపడ్డ పార్టీ నేతలను బుజ్జగించే పనిలో టీపీసీసీ నిమగ్నమైంది. టికెట్ రాకపోవడంతో అసంతృప్తికి గురైన మునుగోడు నేత చెలమల కృష్ణారెడ్డితో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. పార్టీకి అండగా ఉండాలని కృష్ణారెడ్డికి రేవంత్ నచ్చచెప్పినట్లు తెలుస్తోంది. భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయని అన్నట్లు సమాచారం. దీనికి ఆయన కూడా మెత్తబడినట్లు తెలుస్తోంది. మరోవైపు మునుగోడు అభ్యర్థి పాల్వాయి స్రవంతి కూడా రేవంత్ ఇంటికి వెళ్లారు. పాల్వాయి స్రవంతి, చెలమల కృష్ణారెడ్డి ఇద్దరిని కూర్చొబెట్టి పీసీసీ చీఫ్ రేవంత్ మాట్లాడినట్లు తెలుస్తోంది. నాయకులు అందరూ ఐకమత్యంతో పనిచేసి మునుగోడు ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు విజయాన్ని సాధించిపెట్టాలని కాంగ్రెస్ అధిష్ఠానం శుక్రవారం రోజున సూచించింది. ఈమేరకు కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మాణిక్కం ఠాగూర్ ట్విట్టర్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. తన పోస్ట్ తో పాటు పాల్వాయి స్రవంతిని మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటిస్తూ కాంగ్రెస్ అధిష్టానం జారీ చేసిన లేఖను ఆయన ట్యాగ్ చేశారు. మునుగోడు అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడ్డ వారిలో చెల్లమల్ల కృష్ణారెడ్డితో పాటు పల్లె రవి, కైలాష్ నేత కూడా ఉన్నారు. వీరిని బుజ్జగించేందు ఏఐసీసీ సెక్రటరీ బోసు రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరగనుంది. దీనికి కాంగ్రెస్ మునుగోడు అభ్యర్థి పాల్వాయి స్రవంతి కూడా హాజరుకానున్నారు. ఈ సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మధుయాష్కీ, ఇతర ముఖ్య నేతలు కూడా హాజరవుతారు.

# ఎయిమ్స్‌ను సందర్శించిన కేంద్రమంత్రి

**సేవలు, సౌకర్యాలపై మంత్రి భారతి ప్రవీణ్ ఆరా**

**అభివృద్ధి పనులను వివరించిన ఎంపి కోమటిరెడ్డి**




**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమసమాజం):** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీ నగర్ ఎయిమ్స్‌ను కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్, కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సందర్శించారు. రూ.1021 కోట్ల తో ఎయిమ్స్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. నాగార్జున కన్స్ ట్రక్షన్ వాళ్ళకు 2023లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరామని ఆయన వెల్లడించారు. ఇండియాలోనే బెస్ట్ ఎయిమ్స్‌గా.. బీబీ నగర్ ఎయిమ్స్‌ను తీర్చిదిద్దుతామని కేంద్ర మంత్రి తనకు హామీ ఇచ్చారన్నారు. భువనగిరి, నల్లగొండ జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్న ఆయన... గాంధీ, ఉస్మానియాలు మాత్రమే పెద్ద ఆసుపత్రులుగా ఉన్నాయన్నారు. ఆ ఆస్పత్రులకు పోయేవరకు ఎంతోమంది రోగులు చనిపోతున్నారని, అందుకే బీబీనగర్ ఎయిమ్స్‌ని అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశానని తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్‌కు రావటం , అందర్నీ కలవటం సంతోషంగా ఉందని కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్ అన్నారు. దేశంలో ఎయిమ్స్‌లను ఏర్పాటు చేశామని, నాణ్యమైన వైద్య విద్య, వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. ఓపీ సేవలు మంచిగా అందుతున్నాయని బీబీ నగర్ ఎయిమ్స్ కి కితాబిచ్చారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు వైద్యుల సేవలు అమోఘమన్నారు. ఆయుష్మాన్ భారత్ మిషన్ ద్వారా సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందుతోందన్నారు. బీబీ నగర్ ఎయిమ్స్ కు సంబంధించిన సమస్యలను రివ్యూ మీటింగ్ లో అధికారులు చెప్పారని, వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

# కులవృత్తుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి

**మైలారం రిజర్వాయర్‌లో చేపలు వదిలిన మంత్రి ఎర్రబెల్లి**



**వరంగల్, సెప్టెంబర్ 10 (సమసమాజం):** రాష్ట్రంలోని కులవృత్తుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు మత్స్యకారుల సంక్షేమానికి రూ. 500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధికి చేయూతనిస్తున్నామని స్పష్టం చేశారు. రాయపర్తి మండలం మైలారం రిజర్వాయర్‌లో 9 లక్షల 12 వేల చేపపిల్లలను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గోపితో పాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. ఉద్యోగాల కల్పనతో పాటు స్వయం ఉపాధి అవకాశాల కల్పనకూ పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం నీళ్లు, 24 గంటల కరెంట్‌తో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి వేరే ప్రాంతాలకు చేపలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామన్నారు. మైలారం పోతే మంచి చేపలు దొరుకుతాయి అనే పేరు తీసుకురావాలి. మంచి స్థలం చూసి హోల్ సెల్ మార్కెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందు కోసం ఓ బిల్డింగ్ కూడా కట్టిస్తానని, కోల్డ్ స్టోరేజ్ కూడా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకార్మికులు అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం తప్పకుండా తోడ్పాటును అందిస్తుందన్నారు. మహిళా మత్స్య కార్మికులు ఇంకా అవగాహనా పెంచుకొని మార్కెటింగ్‌లో నైపుణ్యం సంపాదించాలన్నారు. మైలారంలో మహిళలకు ప్రత్యేక షాప్ కేటాస్తానని దయాకర్ రావు చెప్పారు.

## రాష్ట్ర వ్యాప్తంగా రెండు మూడు రోజులుగా వర్షాలు

**పలుచోట్ల పొంగిపొర్లిన వాగులు వంకలు**



**హైదరాబాద్,సెప్టెంబర్ 10 (సమసమాజం):** రాష్ట్ర వ్యాప్తంగా రెండు మూడు రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. శుక్రవారం కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. హైదరాబాద్, ఉమ్మడి కరీంనగర్, నల్గొండ, వరంగల్, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు పడ్డాయి. కొన్ని చోట్ల వాగులు ఉప్పొంగి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో వైపు రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ వరంగల్, మెదక్, జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అధికారులు హెచ్చరించారు. గత 24 గంటల్లో రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లా నాయకల్ ల 9.16 సెంటీమీటర్లు, కామారెడ్డి జిల్లా నాగారెడ్డి పేటలో 7.8సెం.మీ, కరీంనగర్ జిల్లా గన్నేరు వరంలో 7.18 సెంటీమీటర్ల వాన పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా మూట కొండూరు ప్రాంతంలో 6.9, నిర్మల్ జిల్లా పెంబిలో 6.43 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. సిటీలో కురిసిన భారీ వర్షానికి ముకరంపుర, రాంనగర్, విద్యానగర్, జ్యోతినగర్, కట్టరాంపూర్ ప్రాంతాలు నీట మునిగాయి. శాతవాహన యూని వర్సిటీ రోడ్డుపై భారీగా నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఒ.ఓఆ గేట్లు ఎత్తారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలర్టులు జారీ చేశారు. సిద్దిపేటలో ఏకధాటిగా 3గంటలపాటు వర్షం పడింది. పాత బస్టాండ్, భరత్ నగర్, మెదక్ రోడ్డు, హైదరాబాద్ రోడ్లు నీట మునిగాయి. పాత బస్టాండులో రెండు ఫీట్ల మేర నీరు నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, ఇల్లందు, సుజాతానగర్, ములకలపల్లి ప్రాంతాల్లో వర్షాలు దంచికొట్టాయి. నారాయణ పేట జిల్లా మక్తల్ లో భారీ వర్షాలకు గొల్లపల్లి ,మంథన్ గోడ్ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో మంథన్ గోడ్-మక్తల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నాగర్ కర్నూల్ జిల్లాలో దుంధుబి, దెయ్యాల, ఉడుముల వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలోని బతుకమ్మ వాగులో 30 మంది రైతులు చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇక రాష్ట్రంలో పిడుగులు పడి ఇద్దరు చనిపోయారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెట్రాం చెలక స్టేజి దగ్గర పిడుగు పడి వసంతరావు అనే రైతు చనిపోయారు. రాజన్న సిరిసిల్లా జిల్లా మూడపల్లిలో పిడుగుపాటుకు ఓ మహిళ మృతి చెందగా.. కామారెడ్డి జిల్లా పోతాయి పల్లిలో పిడుగు పడి 20 మేకలు చనిపోయాయి. కరీంనగర్ జిల్లా యాదవుల పల్లెలో బర్రె, దూడ మృతి చెందాయి.

# రాహుల్‌తో పాస్టర్ పొన్నయ్య భేటీ

(మొదటి పేజీ తరువాయి..)
సమాధానమిచ్చారు. దేవుని రూపంలో ఆయన అవతరించారని, ఆయనే నిజమైన దేవుడని చెప్పారు. కానీ శక్తి అలా కాదని... అందులో కేవలం మానవ రూపాన్ని మాత్రమే మనం చూస్తామని తెలిపారు. దీంతో పొన్నయ్య ఇచ్చిన సమాధానాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పాస్టర్ పొన్నయ్య ఇలా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇప్పుడేం కొత్త కాదు. గతంలోనూ ఆయన కొన్ని తీవ్ర వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కారు. గతేడాది ఆయన ప్రధాని మోడీ, అమిత్ షా, డీఎంకే మంత్రులకు వ్యతిరేకంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో జులైలో ఆయన్ని పోలీసులు అరెస్టు చేశారు.

# రైతులను కొట్టు... కార్పోరేట్లకు పెట్టు



**దేశంలో ఆహారభద్రతకు భరోసా ఏదీ**

**కేంద్రం తీరుపై మండిపడ్డ హరీష్ రావు**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 10 (సమసమాజం):** రైతులను కొట్టు.. కార్పొరేట్లకు పెట్టు అన్నట్లుగా కేంద్రం తీరు తయారైందని మంత్రి హరీశ్ రావు అన్నారు. వరి కొనుగోళ్ల విషయంలో బీజేపీ సర్కార్ అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పఠాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలన రైతులకు శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధ్యానం కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం చెప్పినప్పటికీ వినలేదని విమర్శించారు. నూకల ఎగుమతిపై నిషేధం, వరి ఎగుమతిపై 20 శాతం సుంకం విధించారని చెప్పారు. సాధారణంగా దేశంలో ఆహార నిల్వలు తగ్గినప్పుడు నిషేధం పెడుతారు. మరి ఇప్పుడు ఎందుకు పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. దేశ ఆహార భద్రతకు భరోసా లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం అసంబద్ధ నిర్ణయాలవల్ల వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నాని చెప్పారు. రైతుల ఆదాయం రెట్టింపు అన్నారు.. అది ఏమైందని నిలదీశారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తున్నదని, సగం భారతావనికి అన్నం పెట్టే రాష్ట్రంగా అవతరించిందని మంత్రి హరీశ్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 23 జిల్లాలో 72 లక్షల ఎకరాల్లో వరి పండితే, ఇప్పుడు 10 ఉమ్మడి జిల్లాలో 65 లక్షల ఎకరాల్లో వరి పండిందని చెప్పారు. సీఎం కేసీఆర్ తెలంగాణను ఆకుపచ్చ రాష్ట్రంగా మార్చారని వెల్లడించారు. ముఖ్యమంత్రి అతి త్వరలో సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారని, మెడికల్ కాలేజీని ప్రారంభిస్తారని వెల్లడించారు. అదేవిధంగా పఠాన్‌చెరులో మల్టీ స్పెషాలిటీ దవాఖానకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

# మత్స్య రంగంపై ఆధారపడ్డ వారికి ప్రోత్సాహం

**బేగంబజార్‌లో ఫిష్ మార్కెట్ ప్రారంభించిన మంత్రి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమసమాజం):** మత్స్య రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బేగంబజార్‌లో రూ.9.50కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో నూతనంగా నిర్మించిన ఫిష్ మార్కెట్ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం భవనం మొత్తం కలియదిరిగారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లో సరైన సౌకర్యాలు, వసతులు లేక విక్రయదారులు, కొనుగోలు దారులు అనేక ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రూ.9.50 కోట్ల వ్యయంతో అన్ని సౌకర్యాలు, వసతులతో నూతన మార్కెట్ భవనాన్ని నిర్మిచిందన్నారు. 43 హోల్‌సేల్ స్టాల్స్, కోల్డ్ స్టోరేజీ, 90 రిటైల్ స్టాల్స్, 71 కటింగ్ స్టాల్స్, పది డ్రై ఫిష్ స్టాల్స్, ఒక క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవనంలో లిఫ్ట్ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. మార్కెట్‌లో వ్యాపారం చేసుకునే వారికి మాత్రమే స్టాల్స్‌ను కేటాయిస్తామని స్పష్టం చేశారు. స్టాల్స్‌కు అర్హులైన వారి పేర్ల జాబితాను బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. పరిశుభ్రమైన వాతావరణంలో చేపలను విక్రయించుకోవడం వలన మత్స్యకారులు గిట్టుబాటు ధరను పొందే అవకాశం ఉంటుందనే ఆలోచనతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మార్కెట్ల నిర్మాణానికి చర్యలు చేపట్టిందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని కూకట్‌పల్లి, మల్లాపూర్‌లో చేపల మార్కెట్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. రూ.50కోట్ల వ్యయంతో హోల్‌సేల్ ఎక్స్‌పోర్ట్ ఫిష్ మార్కెట్‌ను నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యం అన్నారు. పేదప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, ఫిషరీస్ కమిషనర్ లచ్చిరాం భూక్య, బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సీఈ దేవానంద్, డీడీ దత్తు పాంత్, ఈఈ సురేష్, ఎస్టేట్ ఆఫీసర్ భాషా, టీఆర్ఎస్ నేతలు ప్రేమ్‌సింగ్, నందు బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడులో కేసీఆర్‌ను చిత్తుగా ఓడగొడతా

**ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏ పాల్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమసమాజం):** మునుగోడులో కేసీఆర్‌ను చిత్తుగా ఓడగొడతానని ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏ పాల్ అన్నారు. త్వరలోనే మునుగోడులో పోటీచేసే తమ పార్టీ అభ్యర్థిని ప్రకటిస్తామని చెప్పారు. మునుగోడులో గెలిచిన ఆరునెలల్లో 50వేల ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు ఉచిత విద్య, అందిస్తామని తెలిపారు. ఒక వారంలో తమ చారిటీ తరపున 175 గ్రామాల్లో 175 ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. అవినీతిపాలనను అంతంచేసేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 2న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న గ్లోబల్ పీస్ మీటింగ్?కు 28 దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు వస్తారని కేఏ పాల్ తెలిపారు. ఈ మీటింగ్ పట్ల కేసీఆర్ కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ను మీటింగ్?కు ఆహ్వానిద్దామంటే.. అహంకారంతో ఆయన కలవడం లేదని ఆరోపించారు. పూర్తిగా నష్టపోయిన తెలంగాణను బాగుచేద్దామనే ఉద్దేశ్యంతోనే ఈ మీటింగ్?ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ వచ్చినప్పుడు కేసీఆర్ ఆస్తి ఎంత.. ఇప్పుడు ఎంత అని ప్రశ్నించారు. 48 గంటల్లోగా పీస్ మీటింగ్ పై కేసీఆర్ స్పందించాలని కేఏ పాల్ డిమాండ్ చేశారు. పోలీసులు కల్వకుంట్ల కుటుంబం చెప్పినట్లు చేస్తున్నారని ఆరోపించారు. ఏదిఏమైనా అక్టోబర్ 2న పీస్ మీటింగ్ జరుగుతుందన్నారు. ఈ మీటింగ్ వల్ల లక్ష కోట్లు లేదా లక్ష ఉద్యోగాలు రాష్ట్రానికి వస్తాయని చెప్పారు. కేసీఆర్ మళ్లీ సీఎం కారని..భూస్థాపితం అవుతారని విమర్శించారు. గతంలో బీజేపీకి సపోర్ట్ చేసిన కేసీఆర్..ఇప్పుడు కేంద్రంపై యుద్ధం అంటూ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు.

# దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది

(మొదటి పేజీ తరువాయి..) నరేంద్రమోదీ కీలక వ్యాఖ్యలుచేశారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. అహ్మదాబాద్ లోని సైన్స్ సిటీలో రెండు రోజుల సెంటర్-స్టేట్ సైన్స్ క్లాన్ కేవ్ ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ లో భారత్ 46వ స్థానానికి ఎదిగిందని.. 2015లో 81వ స్థానంలో ఉండగా.. అతి తక్కువ కాలంలో 25 స్థానాలు ఎగబాకిందని గుర్తుచేశారు. అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతున్న తీరు చూసి ఎంతో గర్వపడుతున్నానన్నారు ప్రధానమంత్రి నరేంద్రమోది. దేశాన్ని ప్రపంచ శాస్త్ర, సాంకేతిక కేంద్రంగా నిర్మించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసిపనిచేయాలన్నారు. శాస్త్ర వేత్తలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందించాలని, రాష్టాల్లో అవసరం మేరకు సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లను నిర్మించడంలో రాష్ట్రాలు తమ వంతు కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. రాష్టాల్లోని ఉన్నత విద్యాసంస్థల్లో ఇన్నోవేషన్ ల్యాబ్‌ల సంఖ్యను పెంచాలన్నారు. శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడం ద్వారా స్థానిక సమస్యలకు సైన్స్ ఆధారిత పరిష్కారాలను కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. 2014 నుంచి సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో గణనీయంగా పెట్టుబడులు పెరిగాయన్నారు. అన్ని రంగాల్లో భారత్ ను పరిశోధన, ఆవిష్కరణల ప్రపంచ కేంద్రంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. అందరికీ అందుబాటులో గృహాలు, వ్యవసాయం, ఆర్థిక వృద్ధికి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించాలన్నారు. జై జవాన్, జై కిషన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్ అనే నినాదంతో నేటి నయా భారత్ ముందుకు సాగుతుందన్నారు. నేడు భారత్ నాల్గవ పారిశ్రామిక విప్లవానికి నాయకత్వం వస్తోందన్నారు. మన శాస్త్రవేత్తల విజయాలను పండుగగా జరుపుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు.

# మలిదశ ఉద్యమానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తి

**నివాళి అర్పించిన మంత్రి ఎర్రబెల్లి**



**వరంగల్, సెప్టెంబర్ 10 (సమసమాజం):** మలిదశ తెలంగాణ ఉద్యమానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తి అని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, నన్నపునేని నరేందర్‌తో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ నిజాం రజాకార్లను, దేశ్‌ముఖ్‌లను ఎదుర్కొన్న వీరవనిత అని కొనియాడారు. ఆమె జయంతి, వర్ధంతిని ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్నందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ చూపుతూ ఆనాటి దేశ్‌ముఖ్‌లు, రజాకార్ల గుండెల్లో భయం పుట్టించిందన్నారు. ఒక వైపు సాయుధ పోరాటం చేస్తూనే, మరోవైపు అమ్మలా ఉద్యమకారులకు అన్నం పెట్టి ఆదరించిన మహనీయురాలన్నారు. ఐలమ్మ భూపోరాటం విజయంతో అప్పటి ఉద్యమ నాయకులు అప్పటి దొరల భూములు పేదలకు పంచారన్నారు. ఐలమ్మ స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ తెలంగాణ సాధించారన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తున్నారన్నారు. పరిపాలనలో ఉద్యమ స్ఫూర్తిని పాటిస్తున్నారని, అందుకే తెలంగాణ అన్నిరంగాల్లో అగ్రగామిగా మారిందన్నారు.

# 17న హైదరాబాద్‌లో విమోచన ఉత్సవాలు

**షోయబుల్లా ఖాన్, వందేమాతరం కుటుంబ సభ్యులతో భేటీ**

**తెలంగాణ విమోచనోత్సవాలను విస్మరించారన్న కిషన్ రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమసమాజం):** గత పాలకులు విమోచన దినోత్సవాన్ని మరుగున పడేశారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీలో స్వాతంత్య సమరయోధులు షోయబుల్లాఖాన్ కుటుంబ సభ్యులను ఆయన కలిశారు. నిజాం,రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన యోధులను స్మరించుకొని వారి కుటుంబాలను సన్మానిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ లో నిర్వహిస్తున్న విమోచన వేడుకల్లో అమిత్ షా పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ విముక్తి ఉత్సవాలను గతంలో ఏ ప్రభుత్వం నిర్వహించలేదన్నారు. కేసీఆర్ సర్కార్ నిరంకుశంగా వ్యవహరిస్తూ బీజేపీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సంవత్సరం పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. స్వాతంత్య ఉద్యమంలో గుర్తింపు దక్కని ఉద్యమకారులను కేంద్ర ప్రభుత్వం గుర్తించి వారిని స్మరించుకొనున్నట్లు ఆయన తెలిపారు. స్వాతంత్య ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీలో వందేమాతరం అని నినాదించి జైలుకు వెళ్లిన వందేమాతరం రామచందర్ రావు కుటుంబ సభ్యులను కిషన్ రెడ్డి శనివారం బేగంబజార్ లో కలిశారు. 75 ఏళ్ల స్వాతంత్య్ర దేశంలో నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమించిన వీరులకు గుర్తింపు దక్కలేదని కిషన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏడాది పాటు వారిని స్మరించుకుంటూ... వారి జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహిస్తామన్నారు. 1948లో అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్ నగరంలో జాతీయ జెండాను ఎగురవేసి నిజాం పాలనకు చరమగీతం పాడరాని.. ఈ ఏడాది సెప్టెంబర్17న హైదరాబాద్ నగరంలో హోమ్ శాఖ మంత్రి అమిత్ షా జాతీయ జెండా ఎగురవేస్తారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

### శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి

**నిజామాబాద్, సెప్టెంబర్ 10 (సమసమాజం):** శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగింది. ఇప్పటికే ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో ఎనిమిదిగేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయానికి 58వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అదేస్థాయిలో దిగువకు వదులుతున్నారు. శ్రీరాంసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు. ప్రస్తుతం 1091 అడుగుల మేర నీరుండగా.. 90 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పరీవాహక ప్రాంతాలతో పాటు ఎగువ నుంచి ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతున్నది.

## వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలు మరువలేనివి

**నాగిళ్ళ శంకర్ (రచయిత)**



**నల్లగొండ, సెప్టెంబర్, 10 (సమ సమాజం):** చాకలి ఐలమ్మ 37వ వర్ధంతి సందర్భంగా చండూరు మండల కేంద్రంలోని సత్యసాయి కాంప్లెక్స్ లో చాకలి ఐలమ్మ సంఘం.ఆధ్వర్యంలో నిర్వహించడం. జరిగింది.చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పగుచ్చాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంనికి సంఘం చైర్మన్ నాగిళ్ళ శంకర్ (రచయిత) ఆధ్వర్యంలో నిర్వహించగా. చైర్మన్ మాట్లాడుతూ భూమి,భుక్తి,వెట్టి చాకిరి విముక్తి కోసం సంబండ వర్గాలను కూడగట్టి కొంగు నడుము చుట్టిన. చాకలి ఐలమ్మ తరతరాలకు స్ఫూర్తిగా నిలిచిందని.ఆమె త్యాగంమరువలేనిదని.చాకలి ఐలమ్మ జయంతి వర్ధంతి అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగేలా చూడాలని.అమ్మ త్యాగాన్ని వృధా చేయకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్ బండ్ పై విగ్రహం పెట్టాలని తెలంగాణలోని 33 జిల్లాలకు ఏదైనా జిల్లా పేరు చాకలి ఐల్లమ్మ పేరు నామకరణం చేయాలని. తెలంగాణలోని శ్రీనిధి పథకానికి చాకలి ఐలమ్మ నిధిగా మార్చాలని.ప్రతి నియోజకవర్గ జిల్లా కేంద్రాల్లో చాకలి ఐలమ్మ విగ్రహాలను.పెట్టాలని.సీనియర్ నాయకులు పులకరం కొండయ్య,భూతరాజ్ దశరథ. ప్రముఖ వ్యాపారవేత్త తేలుకుంట్ల చంద్రశేఖర్, డాక్టర్ నరసింహ,ముదిరాజ్ జేఏసీ నాయకులు కట్ట సైదులు భూతరాజు స్వామి, నలపరాజు లింగస్వామి, సంగెపు శ్రీనివాస్, భీమనపల్లి శివ, బూత్ రాజు వేణు, ఐతరాజు శివ, ఎర్రజల్ల రాము, మహమ్మద్ గౌస్, కారింగు గణేష్, ఎర్రజేల్ల వెంకన్న, చాద గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యిస్తంభాల గుడికి యునెస్కో గుర్తింపునకు కృషి

**వెయ్యిస్తంభాల గుడి అభివృద్ధికి రూ. కోటి కేటాయింపు**

**ఆలయాన్ని దర్శించుకున్న ఎంపి సంతోష్ కుమార్**



**వరంగల్, సెప్టెంబర్ 10 (సమసమాజం):** వెయ్యిస్తంభాల గుడికి యునెస్కో గుర్తింపునకు కృషి చేస్తానని ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. కాకతీయుల కళావైభవానికి ప్రతీక అయిన వెయ్యి స్తంభాల గుడి అభివృద్ధికి శనివారం ఆయన రూ. కోటి కేటాయించారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వరంగల్ వచ్చిన ఎంపీ సంతోష్‌కుమార్.. భద్రకాళీ అమ్మవారు, రుద్రేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెయ్యిస్తంభాల గుడిని పరిశీలించారు. అద్భుతమైన కళాకృతులు, శిల్పసంపద కేంద్ర పురావస్తుశాఖ నిర్లక్ష్యానికి గురికావడం.. ఏండ్లు గడుస్తున్నా కల్యాణమండప నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మన చరిత్ర, సంస్కృతిని మనమే కాపాడుకోవాలని ఎంపీ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటకాన్ని ఆకర్షిస్తున్న వెయ్యిస్తంభాల గుడి అభివృద్ధికి, ఇతర సౌకర్యాల కల్పన నిమిత్తం రూ. కోటిని తన ఎంపీ ల్యాడ్స్ నుంచి అందిస్తున్నానని చెప్పారు. ప్రతీ ఏటా రూ. కోటి కేటాయించి ఆలయ పునర్వైభవానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి భద్రకాళీ అమ్మవారి ఆలయం, వెయ్యి స్తంభాల ఆలయ పరిసరాల్లో 'గ్రీన్ ఇండియా చాలెంజ్' లో భాగంగా ఆయన మొక్కలు నాటారు. అనంతరం గోశాలలో గోవులకు ఆహారం తినిపించారు. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరాలైన హన్మకొండ, వరంగల్ ట్విన్ సిటీస్ అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నదన్నారు. వరంగల్ నగరం మునుపెన్నడూ లేనంత వేగంగా అభివృద్ధి సాధిస్తుండడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వరంగల్ అంటే సీఎం కేసీఆర్‌కు ఎనలేని అభిమానమని వెల్లడించారు. ఎంపీ సంతోష్‌కుమార్ వెంట పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ ఛీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, నన్నపనేని నరేందర్, మాజీ ఎంపీ సీతారామ్‌నాయక్, కుడా చైర్మన్ సుందర్‌రాజుతోపాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌ది అబద్ధాల పాలన

**8 ఏళ్లుగా ఒరగబెట్టిందేమీ లేదు, కెసిఆర్ పాలనపై మండిపడ్డ షర్మిల**



**వనపర్తి, సెప్టెంబర్ 10 (సమసమాజం):** అబద్దాలతో పాలన సాగించే కెసిఆర్ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గత 8 ఏళ్లుగా సీఎం కేసీఅర్ ఏం చేశారో చెప్పాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వనపర్తి మండలం రాజపేట గ్రామస్థులతో ముచ్చటించిన వైఎస్ షర్మిల.. అనంతరం సీఎం కేసీఆర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాల పేరు చెప్పి ప్రతివర్గాన్ని మోసం చేశారన్న ఆమె... మాటమీద నిలబడటం అంటే కేసీఆర్ కి తెలియదని విమర్శించారు. ఇచ్చిన మాట కోసం ప్రాణాలు సైతం ఇచ్చిన వ్యక్తి వైఎస్సార్ అని షర్మిల చెప్పారు. తెలంగాణలో ఇప్పుడు రాజన్న పాలన లేదని, కేసీఅర్ నిర్లక్ష్యాన్ని ఎండగట్టడంలో బీజేపీ, కాంగ్రెస్ విఫలమయ్యాయని తెలిపారు. 2000 కిలో మీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకోబోతున్న తనకు అడుగడుగునా సమస్యలే ఎదురయ్యానని వాపోయారు. కేసీఆర్ పాలన పోవాలని, వైఎస్సార్ సంక్షేమ తెలంగాణ కావాలని వైఎస్ షర్మిల కోరారు. వైఎస్సార్ తీసుకొచ్చిన ప్రతి పథకాన్ని అమలు




చేస్తానని స్పష్టం చేశారు. వైఎస్ఆర్టీపీ చీఫ్ వైఎస్ షర్మిల పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లకు చేరుకోనున్న సందర్భంగా వైఎస్సార్ పైలాన్ ను షర్మిల ఆవిష్కరించనున్నారు. శనివారం 148వ రోజు వనపర్తి, దేవరకద్ర నియోజకవర్గాల్లో షర్మిల పర్యటన కొనసాగుతోంది. వనపర్తి మండలం రాజానగర్ కానలీ, రాజపేట మీదుగా దేవరకద్ర నియోజవకర్గంలోకి వైఎస్ షర్మిల అడుగు పెట్టారు. కొత్తకోట మండలం పరిధిలోని సంకిరెడ్డిపల్లి, ఎన్‌హెచ్ 44 మీదుగా కొత్తకోట టౌన్‌కు చేరుకుంటారు.




# చలన చిత్రం




## ఎందరికో ఇన్స్పిరేషన్ మంజు వారియన్

### ఆమె పుట్టిన రోజు సందర్భంగా పలువురు శుభాకాంక్షలు

సమస్యలు వస్తే కొందరు కుంగిపోతారు. కానీ కొందరు మాత్రం వాటిని అధిగమించి ముందుకెళ్తారు. తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటారు. తన జీవితాన్ని సరికొత్తగా మలచుకుంటారు. మంజు వారియర్‌లాగా... అందుకే మంజు వారియర్ ఓ నటిగానే కాదు.. ఓ మహిళగా కూడా ఎంతో స్ట్రాంగ్. ఎందరో ఆమెను ఆరాధిస్తారు. మరెందరికి మంజువారియర్ ఇన్స్పిరేషన్. 10న ఆమె బర్త్‌డే సందర్భంగా పలుఉవరు శుభాకాంక్షలు తెలిపారు. మంజు వారియర్..1978లో.. తమిళనాడు రాష్ట్రం, కన్యాకుమారి జిల్లాలోని నాగర్‌కోయిల్‌లో జన్మించింది. అయితే ఆమె తమిళియన్ కాదు. మలయాళీ. వాళ్ల నాన్న నాగర్‌కోయిల్‌లోని ఓ ఫైనాన్స్ కంపెనీ రీజినల్ ఆఫీసులో పని చేసేవారు. తల్లి గృహిణి. అన్నయ్య మధు నటుడు, నిర్మాత. మంజు ప్రైమరీ ఎడ్యుకేషన్ నాగర్‌కోయిల్‌లోనే జరిగింది. అయితే వాళ్ల నాన్నకు ప్రమోషన్ రావడంతో తిరిగి కేరళ వెళ్లిపోయింది. డిగ్రీ వరకు కన్నూరులో చదువుకుంది. మంజు చిన్నప్పట్నుంచీ మంచి కూచిపూడి డ్యాన్సర్. యూత్ ఫెస్టివల్స్‌లో రెగ్యులర్‌గా ఇచ్చే ప్రదర్శనలు చూసి, దూరదర్శన్‌లో మోహరావమ్ అనే సీరియల్‌లో ఛాన్స్ ఇచ్చారు. 17 ఏళ్ల వయసులో 'సాక్ష్యం' మూవీతో సినీ ఇండస్ట్రీ అడుగుపెట్టారు. ఆ తర్వాత చేసిన 'సల్లాపమ్' మూవీతో బ్రేక్ వచ్చింది. అక్కడి నుంచి ఆమెకు వరుసగా సినిమా అవకాశాలొచ్చాయి. కెరీర్ స్టార్ట్ చేసిన తర్వాత నాలుగేళ్లలోనే మంజు వారియర్ ఇరవై వరకు సినిమాలు చేసేసింది. అలాగే కంటిన్యూ అయితే కథ వేరేలా ఉండేది. కానీ తన తొలి హిట్ మూవీ 'సల్లాపమ్' హీరో దిలీప్‌తో ప్రేమలో పడటం ఆమె జీవితాన్ని మరో మలుపు తిప్పింది. 1998లో దిలీప్‌ని పెళ్లి చేసుకుని నటనకు దూరమైపోయింది. వారికి ఓ పాప పుట్టింది. పేరు మీనాక్షి. అంతా హ్యాపీగా ఉంటుందనుకున్న సమయంలో ఊహించని సమస్యలు రావడంతో దిలీప్‌తో తన బంధానికి విడాకులతో ఫుల్‌స్టాప్ పెట్టింది. నటి భావనని కిడ్నాప్ చేసి, లైంగికంగా వేధించిన కేసులో ప్రధాన నిందితుడే ఈ దిలీప్.




## కార్తికేయ నుంచి తాజాగా మరో పోస్టర్

ఇప్పటికి కొన్ని చోట్ల 'కార్తికేయ-2' హవానే నడుస్తుంది. సినిమా విడుదలై నెల రోజులు దగ్గరికొస్తున్నా కార్తికేయ-2 క్రేజ్ ఏ మాత్రం తగ్గడం లేదు. ఎన్నో వాయిదాల తర్వాత ఆగస్టు 12న విడుదలైన ఈ చిత్రం నిఖిల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బాస్టర్‌గా నిలిచింది. కేవలం తెలుగులోనే కాకుండా విడుదలైన ప్రతి భాషలోనూ ఈ చిత్రం భారీ కలెక్షన్‌లను సాధించింది. ముఖ్యంగా బాలీవుడ్‌లో 'బాహుబలి', 'పుష్ప', 'ఆర్ఆర్ఆర్' చిత్రాల తర్వాత ఆ స్థాయిలో హిందీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. కేవలం విడుదలైన మూడు రోజుల్లోనే ఈ చిత్రం బ్రేక్‌ఈవెన్‌ను పూర్తి చేసుకుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ చిత్రం 30రోజులు పూర్తి చేసుకుంది. ఇక ముప్పై రోజుల్లో ఈ చిత్రం దాదాపు రూ.120 కోట్లను సాధించిందట. అంతేకాకుండా వెయ్యి స్క్రీన్‌లలో ఈ చిత్రం ముప్పై రోజులు పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో మేకర్స్ తాజాగా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంతో నిఖిల్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. అడ్వేంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రానికి చందూ మొండేటి దర్శకత్వం వహించాడు. నిఖిల్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరణ్ హీరోయిన్‌గా నటించింది. బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కీలకపాత్రలో నటించాడు. ఈ చిత్రం తెలుగులో 'గీతా గోవిందం' తర్వాత అత్యధిక ప్రాఫిట్స్‌ను సాధించిన సినిమాగా రికార్డు సృష్టించింది.




## బ్రహ్మాస్త్ర కలెక్షన్ల హవా

ప్రస్తుతం ఎక్కడ చూసిన 'బ్రహ్మాస్త్ర' హవానే కనిపిస్తుంది. బాలీవుడ్ స్టార్ కపుల్ రణ్‌బీర్ సింగ్, అలియాభట్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై పాజిటీవ్ రివ్యూలను తెచ్చుకుంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలుగులో 'బ్రహ్మాస్త్రం' పేరుతో విడుదలైంది. రాజమౌళి ఈ చిత్రానికి తెలుగులో సమర్పకుడిగా వ్యవహరించాడు. నాగార్జున కీలకపాత్రలో నటించిన ఈ చిత్రం తెలుగులో కూడా భారీ అంచనాలతో విడుదలైంది. తాజాగా ఈ చిత్రం తెలుగులో సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. తెలుగు రాష్టాల్లో అత్యధిక ఒపెనింగ్స్ రాబట్టిన హిందీ సినిమాగా బ్రహ్మాస్త్ర సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఒపెనింగ్ డే రోజునే ఈ చిత్రం రూ. 6.2 కోట్లను గ్రాస్ కలెక్షన్‌లను రాబట్టి రికార్డు క్రియేట్ చేసింది. ఈ సినిమాకు ముందు ధూమ్-3పేరిట ఉండేది. ఈ చిత్రానికి తెలుగులో రూ.5.5 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగింది. ఈ శనివారంతో బ్రహ్మాస్త్ర మూవీకి తెలుగులో బ్రేక్ ఈవెన్ కంప్లీట్ అవుతుంది. ఈ సినిమా మొదటి రోజు కలెక్షన్‌లు టాలీవుడ్ మీడియం రేంజ్ హీరో కలెక్షన్‌లకు సమనంగా బ్రహ్మాస్త్ర కలెక్ట్ చేయడం విశేషం అనే చెప్పాలి. మైథలాజికల్ అడ్వెంచరస్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం మూడు భాగాలుగా తెరకెక్కనుంది. అందులో మొదటి భాగం 'శివ' పేరుతో హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైంది. బిగ్‌బీ అమితాబ్, నాగార్జున కీలకపాత్రల్లో నటించగా మౌనీరాయ్ విలన్ పాత్రలో నటించింది. ఫాక్స్ స్టార్ స్టూడియోస్, ధర్మ ప్రొడక్షన్స్, ప్రైమ్ ఫోకస్, స్టార్ లైట్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.




## పాదయాత్రతో సినిమా ప్రచారం

### కృష్ణవ్రింద విహారి కోసం నాగశైర్య న్యూ లైన్

ఇంటర్నెట్ వినియోగం.. సోషల్ మీడియా వాడకం విస్తృతంగా పెరిగిన క్రమంలో సినిమా ప్రమోషన్స్‌లో కూడా వైవిధ్యమైన విధానాలు అమల్లోకి వచ్చాయి. జనాల దృష్టిని ఆకర్షించడానికి డిఫరెంట్ ప్రమోషనల్ స్ట్రాటజీలతో వస్తున్నారు ఫిలిం మేకర్స్. ఇప్పుడు ఓటీటీలకు అలవాటు పడిపోయిన వారిని థియేటర్లకు రప్పించడానికి.. పబ్లిసిటీ మీద ఇంకాస్త ఎక్కువ శ్రద్ధ తీసుకోవాల్సి వస్తోంది. ఇందులో భాగంగా ప్రెస్ మీట్స్ పెట్టడం - ఫన్నీ ఇంటర్వ్యూలు చేసి వదలడం.. టీజర్ లేదా ట్రైలర్ లాంచ్ కోసం ఈవెంట్స్ చేయడం.. గ్రాండ్ గా ప్రీ రిలీజ్ ఈవెంట్స్ నిర్వహించడం.. ప్రధాన నగరాల్లో చక్కర్లు కొట్టడం.. కాలేజీ టూర్లు వంటివి చూస్తుంటాం. అయితే అందుకు విరుద్ధంగా యువహీరో నాగశౌర్య తన సినిమాని జనాలకు చేరువ చేయడానికి పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారట. నాగశౌర్య హీరోగా అనీష్ ఆర్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కృష్ణ వ్రింద విహారి'. శౌర్య హోమ్ ప్రొడక్షన్ ఐరా క్రియేషన్స్ బ్యానర్ లో ఆయన తల్లిదండ్రులు నిర్మిస్తున్నారు. ఇదొక న్యూ ఏజ్ యూత్ ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్. ఇప్పటికే రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'కృష్ణ వ్రింద విహారి' చిత్రాన్ని 23న థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సరికొత్త ప్రమోషన్స్ ముందుకు వెళ్లాలని భావించిన శౌర్య.. రెగ్యులర్ పబ్లిసిటీ ఫార్మాట్ కు భిన్నంగా పాదయాత్రను ఫాలో అవుతున్నాడట. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు నగరాలకు టూర్లు - కాలేజీ విజిట్లు ప్లాన్ చేసిన యువ హీరో.. అక్కడికి వెళ్లిన తర్వాత పాదయాత్ర ద్వారా జనాలతో ఇంట్రాక్ట్ అవుతూ మూవీ ప్రమోషన్స్ చేస్తాడట. శౌర్య ఐడియా బాగానే ఉంది.. కానీ ఇది ఏ మేరకు వర్కవుట్ అవుతుందో.. జనాలను ఎంతవరకు ఆకర్షిస్తుందో.. సినిమాకు ఏ విధంగా ప్లస్ అవుతుందో వేచి చూడాలి. 'కృష్ణ వ్రింద విహారి' సినిమాలో నాగశౌర్య సరసన షిర్లీ సెటియా హీరోయిన్ గా నటించింది. రాధిక శరత్ కుమార్ కీలక పాత్ర పోషించగా.. వెన్నెల కిషోర్ - రాహుల్ రామకృష్ణ - సత్య - బ్రహ్మాజీ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం సమకూర్చారు. సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ అందించగా.. తమ్మిరాజు ఎడిటింగ్ వర్క్ చేశారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in